# పంఛీ
# కాహె హోా తు
# ఉదాస్?

మామూలు మొగుడూ పెళ్ళాల మధ్య ఉత్తరాలు రాసుకోడానికి ఏం సంగతులుంటాయి? చాకలి బట్టల పద్దు గురించి, కడిగి బోర్లించిన గిన్నెల గురించి, వూరగాయ జాడీలగురించి; మందులు రోగాలు

డబ్బు గొడవలు అనారోగ్యాలు మినహా రాసుకోడానికి. గుండెలో దాచు కోవలసిన సంగతులేం వుంటాయి దంపతుల మధ్య....ఆమొగుడూ ఆ వంటిల్లు ఆ మురికి బట్టలూ ఇంకు గమలూ తిట్టుకోడాలు కొట్టుకోడాలు. రోషాలు యింతేగా జీవితం? రోజుకి ఎనిమిది పదిగంటలు ఆ ఆఫీసుల్లో కుర్చీల్లో అఘోరించి వాడిచేత మాటలుపడి వీడిచేత తిట్లుతిని లోపల యేడుస్తూ పైకినవ్వుతూ చాకిరీ చేసేది ఆ రూపాయల కోస మేగా.... రూపాయలు లేకపోతే రోజులు గడవనప్పుడు ఆకాశంకేసి చూస్తూ నక్షత్రాలు లెక్కపెడుతూ పెళ్ళాన్ని ముద్దులాడుతూ చెవిలో గుసగుసలు చెబుతూ ఆడుకుండూ పాడుకుంటూ తింటూ తిరుగుతూ వుండాలంటే యీ రోజుల్లో సాధ్యం కాదుగదా:

మగాడికి ఉద్యోగంతో ఆడదానికి పెళ్ళి పిల్లలు కనడంతో జీవితం మీద తెరపడుతుంది. ఆ స్నానాలు. ఆ మళ్ళు. పూజలు ఆ మంగళహార తులు ఆ దేవుళ్ళ దగ్గర దేవురింపులు ఆ వ్రతాలు ఆ ఆచారాలు ఆ డాబులు అన్నీ ఎందుకు? పాపాలు కడిగేసుకుందుకు. ముక్తికాంతో ముక్తి పురుషుడో వచ్చి వుద్ధరించడం కోసం....కుళ్ళు మనుష్యులకి వారి తాలూకు కల్మషాన్నంతా దాచుకుందుకు, ఆదర్శాలూ దేవుడూ మొక్కు బళ్ళా కావాలి.

మేక, ఆకులు రెమ్మలు నవుల్తోంటే చూడ ముచ్చటగా వుంటుంది. పిచ్చిక ముక్కుతో పుడకలు. గడ్డిపరకలు మెత్తనియాకలు తెచ్చి గూడు కట్టుకుంటే ఎంతో అందంగా వుంటుంది చూడ్డానికి. నీళ్ళల్లో మిలమిలా మెరిసిపోతూ జారే ప్రవాహంలో బాతులు ఈదుతోంటే కనకన రుచిగా అనిపించదూ? ఆకాశంలో బారులు తీర్చి రకరకాల పక్షులు ఎగుర్తోంటే చూడ్డం ఎంత బావుంటుంది? హంసల్లాగా ఏనుగులాగా రంగు రంగుల్తో కదిలే మబ్బులు. ఇసుక తిన్నెలమీంచి పొంగి పొర్లే ప్రవాహాలు, ఊళ్ళు కొండలు. పూలు,చెట్లు. యింత అందమైన సృష్టిలో జీవించే మనిషి రోజూ ఏం చేస్తాడో తెలుసా?

రెండు చేతుల్తో అన్నాన్ని పిసికి గుండ్రంగా ముద్దలు చేసి

గుటుకు గుటుకు మింగుతాడు. అబ్బ. మనుష్యులు తిండి తింటూంటే చూడ్డానికి పరమ రోతగా వుంటుంది. కొరుకుతాడు. చీల్చుకుతింటాడు. అన్నీ నాకే కావాలంటాడు. సృష్టికి అధినాథుడ్నని విర్రవీగుతాడు. ప్రకృతిని జయించాలని గప్పాలుకొడతాడు. మళ్ళీ తను సృష్టించిన రాయి రప్పకే మహిమ కలదని సాగిమొక్కుతూంటాడు. గాలి నీరు ఆకాశం భూమి ఈ సృష్టి సమస్తం తనదనుకుని దస్తా వేజులు రాసుకుంటాడు బాంబులు ప్రేలుస్తాడు. గొప్పవంశం అంటాడు గొప్పకులం అంటాడు గొప్ప జాతివాడ్నంటాడు మనుష్యుల మీదనుంచి నడిచి వెళ్ళి ఎత్తున కూర్చుంటానంటాడు మారణ హోమాలు తలపెడతాడు నల్లవాడి వంటాడు తెల్లవాడి వంటాడు. కొట్లాటలూ లేకుండా వుండలేను యుద్ధాలు తలపెట్టి. వీరత్వం పౌరుషం దేశభక్తి దేశద్రోహం శత్రువు మిత్రుడు అంటాడు. మనిషి నిలువు నిలువంతా అసూయ మోసం దగా. దేవతల్ని తానే సృష్టించాడు. దానవుల్ని తానే సృష్టించాడు ఎల్లప్పుడు తనెక్కిన చెట్టు కొమ్మ తనే నరుక్కుంటాడు. తన మీదకు తనేబండరాళ్ళను దొర్లించడం తన కొంపకు తనే అగ్గి పెట్టుకోడం మనిషికి చాలా ఇష్టం!

ఆ వారసత్వమే యిప్పుడు మనకు సంక్రమించింది. చిరునవ్వులు చూడలేం. బోసి నవ్వుల పసిపాపలను అసహ్యించుకుంటాం. ఏవేవో పెద్ద పెద్దవి చేసెయ్యాలని దొర్లపడడం మానం. కీర్తి దాహం డబ్బు దాహం ఈ రెండూ చల్లారే దెల్లా.... దోచుకోడం దాచుకోడం మానేదెప్పుడు? ఇంత ఫిలాసఫీ ఇప్పుడు ఎందుకు దొర్లుకొస్తోందంటే ఈ మూర్ఖ పపంచానికి దయ శాంతం సహనం సానుభూతి ఔదార్యం ఇన్ని మంచి లక్షణాలు నేర్పేశక్తి స్త్రీలకుంది. అందుకే సృష్టిలో స్త్రీని స్తన్యమిచ్చి సాకమన్నది. తల్లిగుణం లోపించడంవల్నే క్షమా దయా గుణాలు లోపించినై....మన పిల్లడికి టిఫిన్ పెట్టి పక్కవారి పిల్లడు తొంగిచూస్తోంటే ఛీ పొమ్మనికసిరేస్తాం. వీధిలో ముష్టాడునుంచుని మాధాకబళం తల్లీ అని అరుస్తోంటే వినిపించుకోం. చెయ్యి వూరుకోదు. ఎండినరొమ్ముల్ని చీకుతూ ఏడ్చే వీధిలోని దిక్కుమాలిన ఆడ మనిషి పిల్లడికేదన్నా పెట్టమంటే అసహ్యంగా చూస్తాం. నా చిన్న

బొజ్జకు శ్రీరామ రక్ష... మనం నిజంగా పశువులకన్నా కనిష్టం కాదంటారా? సభ్యతకోసం గొప్పకోసం నెత్తిమీద జుట్టువగర్నుంచి గొరిగించి యిస్తాం. ఎందుకు? మనం చేసే వెధవపన్లన్నిటికీ ఓ కాపు కాసేస్తాడని ఆ జగన్నాటక సూత్రధారి. ట్రాన్స్ఫరు చేయించమనీ, ప్రమోషన్లు తెమ్మనీ. కరప్షన్ కేసు కొట్టేయించమనీ. పదవులు కావాలనీ మొక్కుకుంటాం! బేరాలాడ్తాం! గర్వంతో అహంకారంతో డబ్బును చూసుకుని ఉద్యోగాన్ని చూసుకుని మేడలు, తోటలు, దొడ్డు వ్యాపారాన్ని చూసుకుని విర్రవీగుతాం! పిచ్చిక గూళ్ళను పడకొడ్తాం? బుంద చిమ్ము కొంటాం!

ఇచ్చట అంతా క్షేమం తర్వాత మీ క్షేమం వ్రాయించవలెను అని రాస్తాం కాని నిజంగా మన కెవరి క్షేమమూ అక్కర్లేదు. మన ఉత్తరాలలో ఎక్కడా జనం, జీవం తొణికిసలాడదు. ఇక్కడ సెనగపప్పు దొరుకుటలేదు. నాలుగు శేర్లుకాదు కేజీలు బంపవలెను అని రాసి అండర్ లైన్ చేస్తాం. కందిపప్పు డబ్బాల్లోంచి ఊరగాయ జాడీల్లోంచి మన స్త్రీలను మెడ పట్టుకు పైకి లాగి ఆలోచించడం నేర్పాలి. లేకపోతే రేపటి ఆకాశంలోని ఆశల హరివిల్లు కేసి చూడ్డం మాని గోరు చిక్కుడు కాయలు ముందేసుకుని గిల్లుకుంటూ కూర్చుంటారు. మన వనితలు వంటింట్లోంచి పొగగూట్లోంచి తలలెత్తి సామాజిక జీవనంలో బహుళ సంఖ్యలో అడుగు పెట్టి పాలు పంచుకోనిదే భూమి మీద స్వర్గం ఎక్కడ్నుంచి వస్తుంది? ఇప్పటికే మనం ప్రయోజకులు అనుకుంటున్న ఈ మగరాయుళ్ళు తమ బొజ్జెంక మీసాల్తో బోడిగుళ్ళతో బట్టతలల్తో మొత్తం ప్రపంచ రూపురేఖల్ని తారుమారు చేసి ధ్వంసం చేసేశారు.

ప్రపంచ జనాభాలో సగానికి పైగా వున్న స్త్రీలు చూస్తూ వూరుకుంటే ఈ మానవ కల్యాణానికి నొసటను కుంకుమ బొట్టును ఎవరు తీర్చి దిద్దుతారు?

పంఛీ. కా హె హోతు ఉదాస్....

(ఆంధ్ర జ్యోతి సచిత్ర వారపత్రిక సౌజన్యంతో)